కథ

# నిర్ణయం

- వేమూరి ఉషాకుమారి

**"గెట్** ద ఎక్స్ పోర్ట్ ఆర్డర్ ఫైల్ యిమ్మీడియట్లీ" బాస్ గొంతు యింటర్‌కమ్‌లో ఖంగుమంది. బ్యాగ్ సర్దుకుని యింటికి బయలుదేరిన శృతి ఆగిపోయింది. గబగబా ఫైల్ తీసి మొఖానికి నవ్వు పులుముకుని బాస్ క్యాబిన్‌లోకి అడుగుపెట్టింది. తరువాత రెండుగంటల సేపు చైనాతో చెయ్యబోయే కొత్త ప్రాజెక్ట్ గురించి, బాస్, ప్రాజెక్ట్ లీడర్‌తో మంతనాలు తర్జన భర్జనలు. నిట్టూర్చింది శృతి.

- ఆరు నెలల సెలవు తరవాత శృతి ఒక వారం క్రితమే మళ్ళీ డ్యూటీలో చేరింది. ఈ వారం దినదిన గండంగా గడిపింది. ఎప్పుడు వీకెండ్ వస్తుందా ఎప్పుడు రెక్కలు కట్టుకుని తన ప్రాణానికి ప్రాణం, తనని దాదాపు నాలుగు నెలలు తెగ యిబ్బంది పెట్టి భూమిమీద పడ్డ ప్రణవ్ దగ్గరకు పరుగెడదామా అని ఎదురు చూస్తోంది.

శృతి, వివేక్‌లు యిద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లే, పైగా క్లాస్‌మేట్స్. పరస్పరం మనస్సులు యిచ్చి పుచ్చుకుని పెళ్ళి అనే బంధంతో స్థిరపడ్డారు. క్రమేపీ వివేక్ ఎదిగి ప్రాజెక్టు లీడర్‌గా ఈ మధ్యే ఒక మల్టీనేషనల్లో చేరాడు. శృతి మాత్రం ఉన్న స్థాయితో సంతృప్తిపడి పూర్తిగా సంసారంలో పడిపోయింది, శృతికి వాళ్ళ అమ్మగారు భవ్య పెంపకంలో చాలా సాయంచేసారు. భవ్య స్కూల్లో చేరాక విజయవాడకి, హైదరాబాదుకి షటిల్ సర్వీసు చేస్తున్నారు. పాప ఒంటరి తనం చూసి కలివిడి మనస్తత్వం కల శృతి చాలా బాధపడింది. ఇప్పటికీ పుట్టింటికి వెళ్తే తను తమ్ముడు చేసే అల్లరి, సరదా కబుర్లు గుర్తుకొచ్చేవి. భవ్యకి ఒక తోడు కల్పించాలనే నిర్ణయానికి వచ్చింది. వివేక్ హెచ్చరించాడు. కెరీర్‌లో వెనక పడిపోతావని పాప ఒకర్తె చాలని.

తల్లి ధైర్యం చెప్పింది. "నేను సాయం ఉంటాను ఎంతలోకి ఎదుగుతారు. నాలుగైదు ఏళ్ళు ఓపిక పడితే బాబు స్కూలుకి వెడతాడు. ఒకళ్ళకి ఒకళ్ళు తోడు" అని. అనుకోకుండా శృతి నాన్నగారికి గుండె ఆపరేషన్ అవడం, తల్లి బాబుని విజయవాడ తీసుకెళ్ళడం శృతికి చాలా బాధగా, తనలోని ఒక భాగం తన నుండి వేరైన భావన. ఎప్పుడూ ప్రణవ్ ధ్యాసే.

**మూడు కిలోమీటర్ల ప్రయాణం మూడు గంటలు పట్టచ్చని, సాంకేతికంగా యింత పురోగతి సాధించినా అనుకున్నప్పుడు మాట్లాడలేని తన అశక్తత అన్నీ కలిసి శృతిని తీవ్ర అలజడికి గురిచేసాయి.**

వివేక్ చాలాసార్లు శృతికి క్లాసు పీకాడు. "ఏమైంది నీకు? ఎంత యాక్టివ్‌గా ఉండేదానివి." కెరీర్ మీద కాన్సెంట్రేట్ చెయ్యి" అని. యివన్నీ తట్టుకోలేక కొన్నాళ్ళు ఉద్యోగం మానేసింది. మళ్ళీ అంతర్మథనం. చదివిన చదువు, తనతోటి వాళ్ళు కెరీర్‌లో ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ వుంటే తను ఒక సాదాసీదా ఆడదానిలా ఆలోచిస్తున్నానా అని. ఇంటికి దగ్గరగా మరో కంపెనీలో రెండు ఏళ్ళ క్రితమే చేరి బాబు పుట్టాక మళ్ళీ ఆరు నెలలు సెలవు పెట్టింది.

"భవ్య ఏం చేస్తోందో! ఈ వాన ఒకటి. ఇంత కుండపోత వర్షం ఈ మధ్య కాలంలో చూళ్ళేదు. తొందరగా వెడదామంటే బాస్ లెక్చర్ ఒకటి" రోజు ఆరు గంటలకు ఇంట్లో వుంటుంది. భవ్య స్కూల్నించి వచ్చాక రెండు గంటలపాటు పక్క ప్లాటు ఇందిరావాళ్ళ ఇంట్లో ఆడుకుంటుంది. బయటకు వచ్చి చూస్తే ఒక్క ఆటో కూడా దొరకలేదు. ముద్దగా తడిసిపోయి గబగబా అడుగు లేస్తూ రోడ్డెక్కింది. ఒక ఆటో అతన్ని బతిమాలి ఎక్కి కూర్చుంది. మెయిన్ రోడ్డు ఎక్కిందో లేదో ట్రాఫిక్ జామ్ మొదలు. మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న యింటికి వాయు వేగంతో వెళ్ళే తొందరలో శృతి, నత్త నడకలా నడిచే ఆటో. శృతి ఆలోచనలతో అలసిపోయింది.

"తొందరగా పోనీ బాబూ" అంటూ నిమిష నిమిషానికి డ్రైవర్ని హెచ్చరిస్తోంది.

మొబైల్ తీసి ఇరిటికి ఫోన్ చేసింది. భవ్య, తల్లి గొంతు వినగానే ఏడుపు లంకించుకుంది. "అమ్మా ! నాకు చాలా భయంగా ఉందమ్మా! పెద్ద వాన, ఉరుములు మెరుపులు. తొందరగా రా అమ్మా! ప్లీజ్." శృతికి నీరసం ఆవరించింది. ఇంటి పట్టున ఉండకుండా ఉద్యోగం అంటూ పిల్లని దాని మానాన దాన్ని వదిలేసి యిలా వచ్చినందుకు తనని తాను శతసహస్రం తిట్టుకుంది. మొబైల్లో భవ్యకి ధైర్యం చెప్తూ దాన్ని మూడ్‌లోకి తేవడానికి ప్రయత్నిస్తోంది. ఫోన్ కట్ అయింది. కరెంట్ పోయిందట. కార్డ్‌లెస్ పనిచేయక తల్లి మాట ఆగిపోవడంతో ఏడుస్తూ కూర్చుంది.

"తల్లీ! ఏడువకూడదు వచ్చేస్తున్నానమ్మా! ఇంకా కొంత దూరమే. వాన కదా. అందుకని లేటవుతోంది. నువ్వు 100 కౌంట్ చేస్తూవుండు. నేను వచ్చేస్తాను. పోనీ కార్టూన్ నెట్‌వర్క్ పెట్టుకో" అని ఏదో చెప్తోంది. తన పిచ్చిగాని కరెంట్ లేకపోతే టి.వి. ఎట్లా చూస్తుంది? తనకి మతిపోతోంది. యింక లాభంలేదు. మొబైల్లో యిల్లు చేరే వరకు భవ్యని ఎంగేజ్ చెయ్యడమే అని మాట్లాడుతూనే వుంది. మధ్య మధ్యలో ఆటో డ్రైవర్ని హెచ్చరిస్తూనే... పావు గంట తరువాత మొబైల్ మొరాయించింది. చార్జ్ చేసే వీలేది? ఉన్న ఒక్క లింకు తెగిపోయింది. తరువాతి అరగంట, శృతికి నరకమే. ఆఘమేఘాల మీద భవ్య దగ్గర వాలాలని ప్రయత్నం మన చేతిలో ఏదీ లేదని, చివరికి మూడు కిలోమీటర్ల ప్రయాణం మూడు గంటలు పట్టచ్చని సాంకేతికంగా యింత పురోగతి సాధించినా అనుకున్నప్పుడు మాట్లాడలేని తన అశక్తత అన్నీ కలిసి శృతిని తీవ్ర అలజడికి గురిచేసాయి.

ఇంటికి వచ్చి తడి బట్టలతోనే పాప దగ్గరికి వెళ్ళింది. ఇందిర తలుపు తీసే ఉంచింది. శృతి పరిస్థితి చూసి "కొంచెం కాఫీ తాగుతారా ?" అని అడిగింది.

"వద్దండీ, భవ్య ఏదీ?" అనడిగింది.

"యిప్పుడే ఏడ్చి ఏడ్చి అలసిపోయి నిద్దరపోయింది" అంది ఇందిర. గబగబా బట్టలు మార్చుకుని, కుక్కర్ పెట్టి, భవ్యని లేపి కొంచెం అన్నం తినిపించింది. వివేక్ కోసం ఎదురుచూస్తూ కూర్చుంది.

వివేక్ రాగానే "నేను రేపటి నుంచి ఆఫీస్‌కు వెళ్ళడం లేదు" అని ప్రకటించింది.

"అదేంటి! మళ్ళీ మొదటికి వచ్చావు? బీ బోల్డ్ శృతీ, మరీ అంత సెంటిమెంటల్‌గా వుంటే కష్టం. ఇవన్నీ టెంపరరీ" అని ఏదో చెప్పబోయిన వివేక్‌ని మధ్యలోనే ఆపింది శృతి.

"చూడు వివేక్ నువ్వు ఏమైనా చెప్పు. పిల్లలు నన్ను, నేను పిల్లలను మిస్ అవుతున్నాము. ఈ పరిస్థితుల్లో నేను కెరీర్ మీద కాన్‌సెన్‌ట్రేట్ చెయ్యలేను. ప్రణవ్‌ని ఈ వీకెండ్ వెళ్ళి తీసుకొచ్చేస్తాను. కొంత కాలం యింట్లోనే వుంటాను. మన సొంత యింటి ప్లాన్స్ డెఫర్ చేద్దాం. నేను కూడా ఈలోగా నా స్కిల్స్‌ని అప్ డేట్ చేసుకుంటాను. పిల్లల బాల్యం నేను ఎప్పటికీ మిస్ అవకుండా ఉండాలని నా ఆశ. ఇలా ఆలోచించాక నాకు చాలా ప్రశాంతంగా ఉంది. మేబీ నేనొక సెంటిమెంటల్ ఫూల్నే నీ దృష్టిలో. కాని నాకు ప్రస్తుతం నా పిల్లలు, వాళ్ళ బాల్యం ముఖ్యం. ఇంతకంటే నేనేమీ చెప్పలేను" అని భవ్యని గట్టిగా దగ్గరకు తీసుకుంది. దాని పసి మనస్సుకి పూర్తిగా అర్థమవ్వకపోయినా తల్లి తనతోనే వుంటుందని, ఆఫీసుకు వెళ్ళదని తెలిసి దానిముఖం వెయ్యి వాట్ల బల్బులాగా వెలిగిపోయింది.

భవ్య మొఖం చూసాక ఈ తృప్తి ఏ పే పాకెట్ యివ్వలేదని తన నిర్ణయం సబబైనదేనని సమాధానపడింది శృతి.

***